The Vaartha Date:- 21/04/2023

# మెట్రో స్టేషన్లు కిటకిట

## మెట్రో రైళ్లకు పోటెత్తిన ప్రయాణికులు

హైదరాబాద్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త

హైదరాబాద్ మెట్రో రికార్డు బ్రేక్ చేసింది. మెట్రో రైళ్లకు ప్రయాణికులు పోటెత్తారు. ఎండల తీవ్రత పెరగడంతో మెట్రోకు నగరవాసులు క్యూకడుతున్నారు. ఆ రద్దీని చూస్తుంటే ముంబై మెట్రోను తలపిస్తోంది. ఈ క్రమంలో గురువారం నగరంలోని అన్ని మెట్రో స్టేషన్లలో రద్దీ ఏర్పడింది. నాగోలు టూ రాయదుర్గం రూట్ అయితే రైల్లో ఎక్కేందుకు ఇబ్బంది పడ్డారు ప్రయాణికులు. నాగోల్ స్టేషన్ అయితే పూర్తిగా నిండి పోయింది. ప్రయాణికులతో అమీర్‌పేట్ మెట్రో స్టేషన్ కిక్కిరిసిపోయింది. ఇసుకేస్తే రాలనంత జనం కనిపించారు. మెట్రో స్టేషన్లు ఫుల్ అయ్యి, మెట్లపై వరకు ప్రయాణికులు నిల్చున్నారు. గత వారం రోజులుగా రోజుకు నాలుగున్నర లక్షల మందికి పైగా మెట్రోలో ప్రయాణం చేస్తున్నారు. కరోనా సమయంలో పీక్‌లో రోజూ వారీ ప్రయాణికుల సంఖ్య మూడు లక్షలు దాటింది. మళ్లీ ఇప్పుడు అది నాలుగున్నరలక్షలకు రీచ్ అయినట్లు లెక్కలు చెబుతున్నారు. ఎండాకలం..ప్రస్తుతం ఐదు లక్షల మంది వరకు రోజువారీగా మెట్రో ప్రయాణిస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. కెపాసిటీకి మించి మెట్రోలో ప్రమాదకరంగా ప్రయాణం




చేస్తున్నారు. మెట్రో సర్వీసుల సంఖ్య పెంచాలంటూ ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. నిజానికి మెట్రో వచ్చిన తొలినాళ్లలో తీవ్ర నష్టాలను చవిచూసింది. అప్పట్లో ప్రయాణ ఖర్చులు చాలా భారంగా అనిపించేవి. దీంతో సామాన్యులెవరూ మెట్రో జోలికి వెళ్లేవారు కాదు. పైగా అన్ని ప్రాంతాలకూ రవాణా సౌకర్యం లేకోవడం కూడా పెద్ద మైనస్ అనే చెప్పాలి.

ఉదయం సమయంలో ప్రతి ఐదు నిమిషాలకు ఒక రైలు నడుస్తోంది. నాగోలు, అమీర్‌పేట రైల్వే స్టేషన్లలో పరిస్థితి చూస్తే నిమిషానికి ఒక రైలు నడిపినా ప్రయాణికులు సంఖ్య తగ్గేలా లేదు. ఎండాకాలం ప్రారంభం అయినప్పటి నుంచి సర్వీసుల సంఖ్య పెంచింది మెట్రో. అయినా రద్దీ కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా నాలోల్, ఎల్బీ నగర్, దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి ఉద్యోగ, వ్యాపారాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లేవారు..ఎండాకాలం కావడంతో చల్లగా మెట్రో వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో రద్దీ అనూహ్యంగా పెరిగిపోయింది.